క్రిస్మస్ సంబురాలు ఆరంభం

- జిల్లాలో చర్చీల్లో ప్రత్యేక ప్రార్థనలకు ఏర్పాట్లు
- ముస్తాబైన ప్రార్థనా మందిరాలు
- ఇళ్లపై క్రిస్మస్ స్టార్ల ఏర్పాటు

కాజీపేట: క్రిస్మస్ పండుగ పేరు చెబితే చాలు క్రైస్తవుల్లో ఎక్కడాలేని ఉత్సాహం వస్తుంది. డిసెంబర్ నెల ప్రారంభమై 15 రోజులుగా కావస్తుండడంతో లోక రక్షకుడైన యేసు ఉదయించిన వేడుకలను ఘనంగా నిర్వహించడానికి క్రిస్టియన్లు సన్నాహాలు చేస్తున్నారు. జిల్లాలోని చర్చీలు, ప్రార్థనా మందిరాలను యూత్ ఫెస్టివల్స్‌గా నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు చేయడంలో యువత నిమగ్నమైంది.

ఏర్పాట్లలో నిమగ్నం

మానవ జాతిని రక్షించేందుకు దేవదేవుడైన ఏసు క్రీస్తు ఈ లోకంలో జన్మించాడని విశ్వసిస్తూ క్రిస్మస్ వేడుకలను ప్రతిఏటా డిసెంబర్ నెల 24, 25వ తేదీల్లో ఘనంగా జరుపుకుంటారు. జిల్లాలోని అన్ని ప్రాంతాల్లోని చర్చీల్లో ఏటా క్రిస్మస్ వేడుకలు ప్రత్యేకంగా జరుపుతారు. కొన్ని చోట్ల యూత్ క్రిస్మస్‌లు ఏర్పాటు చేసి క్రీస్తు పుట్టిన నాటికలు, సెలబ్రిటీల సాక్ష్యాలు, క్యాండిల్ సర్వీస్ వంటి కార్యక్రమాలు


విద్యుత్ వెలుగుల్లో ఫాతిమానగర్‌లోని చర్చి

క్రీస్తు పుట్టుకను వివరిస్తూ పశువుల పాకలను చర్చీల ఆవరణలో అందంగా తీర్చిదిద్దడంలో పలువురు నిమగ్నమయ్యారు.

విద్యుత్ వెలుగుల్లో చర్చీలు

కాజీపేట పట్టణంలోని సెయింట్ జోసఫ్ చర్చి, ఫాతిమానగర్ కెథిడ్రల్, రివైవల్ చర్చి, బాప్టిస్టు, పెంతోకోస్తు తదితర చర్చీల్లో విద్యుత్ దీపాల అలంకరణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. బాలయేసు ఇంటింటి పర్యటన నగరంలో ప్రారంభం అయింది. క్రైస్తవులు తమ ఇళ్లపై స్టార్లను ఏర్పాటు చేసుకుంటున్నారు. క్రిస్మస్ మాస ఆరంభంతో ప్రతి నిత్యం చర్చీల్లో ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రార్థనలు జరుగుతున్నాయి.


చర్చిలో వెలిసిన పశువుల పాక

యేసును అనుసరించాలి



యేసు ఇచ్చిన రక్షణ విమోచన, విడుదలను ఆనందించాలి. క్రీస్తుకు ఇష్టమైన క్షమ, శాంతి, ప్రేమను మదిలో నింపుకుని జీవితానికి అన్వయించుకుని అనుసరించినప్పుడే నిజమైన క్రిస్మస్. ప్రభువు చూపిన బాటలో ప్రతిఒక్కరూ నడిచి మారు మనస్సు పొందాలి.

– బిషప్ డాక్టర్ ఉడుముల బాల, వరంగల్ మేత్రాసనం, పీఠాధిపతి

ట్రాఫిక్ రూల్స్ తప్పనిసరిగా పాటించాలి


ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పిస్తున్న రామారావు

మామునూరు: రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై వాహనదారులు అవగాహన పెంచుకోవాలని కాజీపేట ట్రాఫిక్ సబ్ ఇన్‌స్పెక్టర్ రావెళ్ల రామారావు సూచించారు. ఈమేరకు ఖిలా వరంగల్ మండలం మామునూరు టీఎస్ఎస్పీ నాలుగో బెటాలియన్‌లో కమాండెంట్ శివ ప్రసాద్‌రెడ్డి పర్యవేక్షణలో జరుగుతున్న స్పెషల్ పోలీసుల 30రోజుల మాన్యువల్ రిఫ్రెష్‌మెంట్ కోర్స్ శిక్షణ శిబిరానికి ఆయన గురువారం హాజరై ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై రామారావు మాట్లాడుతూ పోలీస్ సిబ్బంది తప్పనిసరిగా హెల్మెట్ ధరించి ప్రయాణం చేయాలని, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ, తాగి వాహనాలు నడపరాదని అన్నారు. జంక్షన్లలో సిగ్నల్ లైట్లను అనుసరిస్తూ ప్రయాణం చేయాలని సూచించారు. అనంతరం రెగ్యులైజేషన్ రైట్ ఆఫ్ ది వే గోల్డెన్ అవర్, సైన్ బోర్డ్స్ పనితీరుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎస్సైలు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

రైలు ప్రయాణంలో జాగ్రత్తగా ఉండాలి


అవగాహన కల్పిస్తున్న ఆర్పీఎఫ్ పోలీసులు

కాశిబుగ్గ: రైళ్లలో ప్రయాణించే ప్రయాణికులకు జాగ్రత్తలు పాటించాలని చెప్పినట్లు, పలు అంశాలపై అవగాహన కల్పించినట్లు వరంగల్ ఆర్పీఎఫ్ ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు. వరంగల్ రైల్వేస్టేషన్‌లో గురువారం ఆయన మాట్లాడుతూ పేలుడు, మండే స్వభావం కలిగిన వస్తువులు, మాదక ద్రవ్యాలను తరలించడం, రైళ్లపై రాళ్లతో దాడి చేయడం, నిబంధనలు అతిక్రమించడం నేరమని హెచ్చరించారు. ప్రయాణించే సమయంలో ఫుట్‌బోర్డ్, రూఫ్‌పై ఉండకూడదని చెప్పారు. రాత్రివేళల్లో కిటికీ పక్కన ఆభరణాలు ధరించి ఉండవద్దని అన్నారు. రైళ్లు, రైల్వే ఆస్తులపై దాడులకు పాల్పడితే కఠిన చట్టాలతో శిక్ష తప్పదని తెలిపారు. అనంతరం పాత నేరస్తుల ఫొటోలు – నేరస్తుల తాజా సమాచారాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్పీఎఫ్ పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

టీఈఏ కార్యవర్గం ఎన్నిక



రామన్నపేట: తెలంగాణ ఎంప్లాయిస్ అసోసియేషన్ (టీఈఏ) వరంగల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా బసవరాజ్ కిరణ్, ఎల్.లింగమూర్తి, హనుమకొండ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా బొట్ల రమేష్, గోవిందు నవీన్‌కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యాకూబ్ పాషా తెలిపారు. నగరంలోని సంఘం కార్యాలయంలో గురువారం నిర్వహించిన ఎన్నికల ప్రక్రియకు యాకూబ్ పాషా ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వం ఉద్యోగులకు ఇచ్చిన ప్రతిహామీని నెరవేర్చాలని కోరారు. గత ప్రభుత్వం కేవలం భజన, బానిస సంఘాలతో మాత్రమే సంప్రదిస్తూ గుప్పెడు నాయకులకు ప్రయోజనం చేసిందని విమర్శించారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం వెంటనే మినిస్టర్‌తో కూడిన కమిటీని వేసి పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులను పలువురు అభినందించారు. కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లా కోఆర్డినేటర్ కృష్ణప్రసాద్, వెంకటేశ్వర్లు, ఎండీ రెహమాన్, ఎస్.కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎస్సీ సెల్ గ్రామ అధ్యక్షుడిగా సాయిలు



మడికొండ: కాంగ్రెస్ ఎస్సీ సెల్ మడికొండ గ్రామ అధ్యక్షుడిగా గ్రామానికి చెందిన కడమంచి సాయిలు నియమితులయ్యారు. ఈమేరకు ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు రాము ప్రకటించగా, ఉత్తర్వులను సాయిలుకు పార్టీ కాజీపేట మండల అధ్యక్షుడు తొట్ల రాజుయాదవ్ గురువారం అందజేశారు.

మద్య విమోచన కమిటీని పునరుద్ధరించాలి

ఖిలా వరంగల్: ఉమ్మడి రాష్ట్రంలో పనిచేసిన మద్య విమోచన కమిటీని తిరిగి కాంగ్రెస్ ప్రభుత్వం పునరుద్ధరించాలని విమోచన ప్రచార కమిటీ మాజీ డైరెక్టర్, కాంగ్రెస్ నేత దాసి రాందేవ్ కోరారు. ఈమేరకు హైదరాబాద్‌లోని ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావును గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాందేవ్ మాట్లాడుతూ నగరాలు, పట్టణాలు, గ్రామాల్లోని బెల్ట్‌షాపుల మూసివేతకు నిర్ణయం తీసుకోవాలని సూచించారు. కల్తీ మద్యం, గుడుంబా, బెల్ట్‌షాపులపై నిషేధ కమిటీ ఏర్పాటు చేయాలని మంత్రిని కోరినట్లు ఆయన తెలిపారు.

17న జోన్ కబడ్డీ సెలక్షన్స్

హసన్‌పర్తి: ఈనెల 17న హసన్‌పర్తి జోన్ కబడ్డీ సెలక్షన్స్ నిర్వహించనున్నట్లు జోన్ అధ్యక్షుడు అటికం రవీందర్ ఒక ప్రకటనలో తెలిపారు. జోన్ పరిధిలోని హసన్‌పర్తి, ఆత్మకూరు, దామెర మండలాలకు చెందిన క్రీడాకారులు అర్హులని పేర్కొన్నారు. ఆదివారం ఎంపికలు జరుగుతాయని తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు ఈనెల 24న నగరంలోని జేఎన్ఎస్ మైదానంలో జరగనున్న ఇంటర్ జోన్ పోటీల్లో పాల్గొంటారని రవీందర్ పేర్కొన్నారు.

వడ్డేపల్లి కట్టపై కోతుల పట్టివేత

కాజీపేట: వడ్డేపల్లి రిజర్వాయర్ కట్టపై ఉన్న పార్కులో పర్యాటకులపై దాడులు చేస్తూ గాయపరుస్తున్న కోతుల గుంపును మున్సిపల్ సిబ్బంది గురువారం పట్టుకున్నారు. ఇటీవలి కాలంలో కట్టపై కోతుల బెడద ఎక్కువైంది. పర్యాటకులతో పాటు ఉదయం వేళ పార్కులోకి వాకింగ్ కోసం వచ్చే వారిపై అవి దాడులు చేస్తున్నాయి. ఈ విషయాన్ని మేయర్ గుండు సుధారాణి దృష్టికి 61వ డివిజన్ కార్పొరేటర్ ఎలకంటి రాములు తీసుకెళ్లారు. ప్రత్యేక సిబ్బంది వచ్చి కోతులను పట్టుకుని శానిటరీ అధికారుల ఆధ్వర్యంలో ప్రత్యేక వాహనంలో అటవీ ప్రాంతానికి తరలించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

హసన్‌పర్తి: అనారోగ్య సమస్యలతో మృతిచెందిన హసన్‌పర్తి మండల కేంద్రానికి చెందిన మేకల యేసు రత్నం మృతదేహాన్ని బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్ గురువారం సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్ శివకుమార్, డివిజన్ అధ్యక్షుడు మేకల హరి, నాయకుడు తాళ్ల రమేష్ తదితరులు ఉన్నారు.

ట్రాఫిక్ ఎస్సైగా విధుల్లో చేరిన మొగిలి

కాజీపేట: కాజీపేట ట్రాఫిక్ ఎస్సైగా జూనూరి మొగిలి గురువారం విధుల్లో చేరారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ ప్రధాన కార్యాలయంలో కొంతకాలంగా పనిచేస్తున్న మొగిలిని బదిలీ చేస్తూ సీపీ అంబర్ కిశోర్ ఝా ఆదేశాలు జారీ చేశారు. సీఐ సుజాతతో పాటు ఉన్నతాధికారులను ఎస్సై మర్యాదపూర్వకంగా కలిశారు.

మంత్రి సీతక్కకు అభినందనలు


పుష్పగుచ్ఛం అందజేస్తున్న టీఎన్జీవోస్ నాయకులు

హన్మకొండ అర్బన్: రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్కను టీఎన్జీవోస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గజ్జెల రామ్‌కిషన్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు గురువారం మర్యాదపూర్వంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు. కార్యదర్శి గాజె వేణుగోపాల్, కోశాధికారి పాలకుర్తి సదానందం, సహాధ్యక్షుడు హేమానాయక్, ఉపాధ్యక్షుడు గద్దల రాజు, నాయకులు శంకేశి రాజేష్, నాగేశ్వరరావు, ఇంద్రసేనారెడ్డి, రామకృష్ణ, చిరంజీవి, కిషన్, శ్యామ్, మధు పాల్గొన్నారు.

మంత్రి సీతక్కను కలిసిన విద్యుత్ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ నేతలు

హన్మకొండ: రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క)ను తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు కలిశారు. అసోసియేషన్ టీఎస్ ఎన్పీడీసీఎల్ శాఖ అధ్యక్షుడు ఆరెపల్లి శ్రీనివాస్, కార్యదర్శి దానయ్య, ఉపాధ్యక్షులు కే.ఉపేందర్, రౌతు రమేష్ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ రామస్వామి హైదరాబాద్‌లో గురువారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఎన్పీడీసీఎల్ శాఖ ఆర్గనైజింగ్ సెక్రటరీ లక్ష్మీనారాయణ, నాయకులు ఎస్.కుమారస్వామి, గుర్రం శ్యాంకుమార్ పాల్గొన్నారు.


మంత్రికి బొకే ఇస్తున్న అసోసియేషన్ నాయకులు

మంత్రి సీతక్కకు శుభాకాంక్షలు

హన్మకొండ: మంత్రిగా బాధ్యతలు చేపట్టిన సీతక్కను హైదరాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకుడు డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ, తదితరులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆమెకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

మంత్రులకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు



హసన్‌పర్తి: ఉప ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన భట్టి విక్రమార్క, మంత్రులుగా బాధ్యతలు చేపట్టిన ఉత్తమ్ కుమార్‌రెడ్డి, దామోదర్ రాజనరసింహ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, శ్రీధర్ బాబును వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు హైదరాబాద్‌లో బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారికి బొకేలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పింగిలి వెంకట్రాం నర్సింహారెడ్డి, నాయకులు తదితరులు ఉన్నారు.

మానవ సేవే మాధవ సేవ



వరంగల్: మానసిక, శారీరక ఇబ్బందులతో జీవిస్తున్న వారికి సేవ చేస్తే కొన్ని వేల యజ్ఞాలు చేసిన పుణ్యం వస్తుందని, మానవ సేవే మాధవ సేవ అని శివానంద గురు కల్చరల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ త్రిపురనేని గోపీచంద్ అన్నారు. గురువు శివానందమూర్తి 95వ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని మల్లికాంబ మనో వికాస కేంద్రంలోని సిబ్బందికి నూతన వస్త్రాలను ములుగురోడ్డు సమీపంలోని గురుధామంలో గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానసిక రుగ్మతలున్న వారికి సేవ చేస్తున్న సిబ్బంది అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో మరో ట్రస్టీ బండారు సాయి నారాయణ, శిక్, మునీర్, అశ్విని పాల్గొన్నారు.

మిల్లెట్లు.. ఆరోగ్యానికి ఎంతో మేలు


మిల్లెట్లపై నిర్వహించిన ఫొటో ఎగ్జిబిషన్

రామన్నపేట: మిల్లెట్లు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని ఎల్‌బీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అరుణ డీహెచ్.రావు అన్నారు. అంతర్జాతీయ మిల్లెట్స్ డేను పురస్కరించుకొని ఎన్‌సీసీ పదవ బెటాలియన్ ఆధ్వర్యంలో కళాశాలలో గురువారం ఫొటో ఎగ్జిబిషన్ నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఆరోగ్య సూత్రాలు, భవిష్యత్ తరాలకు కావాల్సిన ఆహార అలవాట్లు, పూర్వీకులు అందించిన మిల్లెట్లు, వాటి శక్తి సామర్థ్యాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు నిర్వహించిన పలు పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కెప్టెన్ డాక్టర్ ఎం.సదానందం, వైస్ ప్రిన్సిపాల్ రాజేందర్‌రెడ్డి, అధ్యాపకులు రవీందర్, మధుకర్‌రావు, రాఘవేందర్ రెడ్డి, అఫ్జల్, శ్రీనివాస్, రాము, ఎన్‌సీసీ కేడెట్లు పాల్గొన్నారు.

కేయూ ఫార్మసీ కళాశాలలో శ్రమదానం


శ్రమదానం చేస్తున్న సమ్మయ్య, వలంటీర్లు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని ఫార్మసీ కళాశాలలో జాతీయ సేవాపథకం (ఎన్ఎస్ఎస్) ఆధ్వర్యంలో వలంటీర్లు గురువారం శ్రమదానం చేశారు. శ్రమదాన కార్యక్రమాన్ని ఫార్మసీ కళాశాల ప్రొఫెసర్ గాదె సమ్మయ్య ప్రారంభించి మాట్లాడారు. సామాజిక సేవా దృక్పథంతో సామాజిక అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటూ, ఆరోగ్యకరమైన వాతావరణను ఏర్పర్చుకోవాలని చెప్పారు. ఎన్ఎస్ఎస్ కార్యక్రమాల్లో భాగస్వాములు కావటం వలన వ్యక్తిత్వ వికాసం పెంపొందుతుందని వివరించారు. బొటానికల్ గార్డెన్, ఎనిమల్ హౌజ్ పరిసర ప్రాంతంలో పిచ్చి మొక్కలను తొలగించి పరిశుభ్రం చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ సునీత, డాక్టర్ సుజాత, డాక్టర్ శశిధర్, వలంటీర్లు పాల్గొన్నారు.

భారత పౌరులందరికి సమాన హక్కులు


ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు

హసన్‌పర్తి: దేశ పౌరులందరికీ రాజ్యాంగంలో సమాన హక్కులు కల్పించినట్లు ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సంస్థ మండల కోఆర్డినేటర్ ఇసంపల్లి సుదర్శన్ తెలిపారు. అంతర్జాతీయ మానవ హక్కుల వారోత్సవాలను పురస్కరించుకుని హసన్‌పర్తి మండలం బైరాన్‌పల్లిలో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ హక్కులు కాపాడానికి ప్రపంచ వ్యాప్తంగా అన్ని దేశాలు 1948వ సంవత్సంలో డిక్లరేషన్‌పై సంతకాలు చేశాయని గుర్తుచేశారు. మానవ హక్కులకు భంగం కలిగినట్లయితే హ్యూమన్ రైట్‌కు ఫిర్యాదు చేసి రక్షణ పొందవచ్చని వివరించారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మహిళా సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

రాముడి పూజిత అక్షింతల స్వాగత ర్యాలీ


ర్యాలీలో పాల్గొన్న నాయకులు

మడికొండ: మడికొండలోని మెట్టు రామలింగేశ్వర స్వామి ఆలయం నుంచి అయోధ్య శ్రీరాంలీల మందిరంలో వరకు కొనసాగిన శ్రీరాముడి పూజిత అక్షింతల కలశ స్వాగత ర్యాలీని విశ్వహిందూ పరిషత్ – భజరంగ్ దళ్ వరంగల్ మహానగర్ వాసులు గురువారం సాయంత్రం ప్రారంభించారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ వరంగల్ కార్యదర్శి శ్రీరామ్ ఉదయ్‌కుమార్, ఉపాధ్యక్షుడు వెలగందుల రాజు, సహాయ కార్యదర్శి సందీప్‌రెడ్డి, అలకట్ల సాయికుమార్, భజరంగ్ దళ్ మహానగర్ జిల్లా కన్వీనర్ గంగారపు హరీశ్, కోకన్వీనర్ రూపిరెడ్డి సూర్యప్రకాష్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకులు చాడ శ్రీనివాసురెడ్డి, రావుల కిషన్, జలగం రంజిత్, బన్న ప్రభాకర్, పానగోటి వెంకట్‌రావు, ధరావత్ సునీల్, పాలకొండ రాజేందర్, దార ధనుంజయ్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వీసీ రమేష్‌కు ఆహ్వానం



కేయూ క్యాంపస్: డిసెంబర్ 24న జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా ది నేషనల్ కన్స్యూమర్ రైట్స్ కమిషన్ ఆధ్వర్యంలో వరంగల్ రోటరీ బిల్డింగ్‌లో నిర్వహించనున్న సదస్సుకు కేయూ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేష్‌ను ఆ సంస్థ బాధ్యులు ఆహ్వానించారు. సంస్థ వరంగల్ చైర్మన్ శ్రీదేవ సాంబమూర్తి, తెలంగాణ రాష్ట్ర వైస్ చైర్మన్ అనితారెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ శ్రీపాండురంగ విఠల్, ఆర్గనైజింగ్ సెక్రటరీ జగదీశ్వర్ గురువారం వీసీతో కలిసి బ్రోచర్‌ను ఆవిష్కరించారు. సదస్సుకు రావాలని వీసీకి ఆహ్వాన పత్రికను అందజేశారు.

వరంగల్ కోటలో పర్యాటకుల సందడి


శిల్పాలను తిలకిస్తున్న పర్యాటకులు

ఖిలా వరంగల్: కాకతీయుల రాజధాని ఖిలా వరంగల్ కోటకు పర్యాటకులు గురువారం పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దీంతో మధ్యకోట శిల్పాల ప్రాంగణం సందడిగా మారింది. ఈ సందర్భంగా అద్భుతమైన శిల్పకళా సంపద, ఖుష్ మహల్, ఏకశిల గుట్ట, రాతి మట్టికోట అందాలను తిలకించారు. అనంతరం పిల్లాపాపలతో కలిసి ఏకశిల చిల్డ్రన్‌పార్కులోని పచ్చని చెట్లనీడన సేదతీరారు. వెంట తెచ్చుకున్న పిండి వంటలను ఆరగించారు. అలాగే, టీఎస్‌టీడీసీ ఆధ్వర్యంలో నిర్వహించే సౌండ్ అండ్ లైటింగ్ షో మరమ్మతులో ఉండటంతో పర్యాటకులు నిరాశతో సాయంత్రం వెనుదిరిగి వెళ్లారు.

అండర్ డ్రెయినేజీ పనులు ప్రారంభం



ఖిలా వరంగల్: చారిత్రక ప్రసిద్ధి చెందిన మధ్యకోట శిల్పాల ప్రాంగణంలో వరదనీరు నిల్వ ఉండకుండా సులభంగా వెళ్లేలా అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణ పనులు గురువారం ప్రారంభమయ్యాయి. కేంద్ర పురావస్తుశాఖ జిల్లా అధికారి మడిపెల్లి మల్లేశం ఆధ్వర్యంలో పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. నిర్మాణం పూర్తయితే వానాకాలంలో శిల్పాల ప్రాంగణంలో నీరు నిల్వ ఉండదని, అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ ద్వారా వరదనీరు బయటకు వెళ్తుందని మల్లేశం తెలిపారు. పర్యాటకులు శిల్పకళా సంపదను వీక్షించడానికి ఎలాంటి ఆంటకం ఉండదని చెప్పారు. కార్యక్రమంలో కేంద్ర పురావస్తుశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

మేడారం జాతర పనులను ఈఈకి అప్పగించొద్దు

హన్మకొండ: మేడారం జాతర అభివృద్ధి పనుల పర్యవేక్షణను ఏటూరునాగారం గిరిజన శాఖ ఈఈకి అప్పగించొద్దని అంబేడ్కర్ విద్యార్థి సంఘం (ఏబీఎస్ఎఫ్) జిల్లా కార్యదర్శి బొట్ల నరేష్ డిమాండ్ చేశారు. గతంలో మేడారం జాతరలో జరిగిన అభివృద్ధి పనుల్లో ఈఈ అవినీతి అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. ఈమేరకు ఈఈ హేమలతపై చర్యలు తీసుకోవాలని హనుమకొండ అశోక కాలనీలోని గిరిజన సంక్షేమ శాఖ ఇంజనీర్ కార్యాలయం ఎదుట ఏబీఎస్ఎఫ్, ఎల్‌హెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో గురువారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా బొట్ల నరేష్ మాట్లాడుతూ ఏటునాగారం గిరిజన శాఖలో పనిచేస్తున్న ఈఈని తొలగించాలని కోరుతూ పీఓకు, ఇతర అధికారులకు ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాలు వినతిపత్రం ఇచ్చినా స్పందించకపోవడం బాధాకరమని వాపోయారు. ఈ కార్యక్రమంలో ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బానోత్ ప్రవీణ్ నాయక్, జిల్లా అధ్యక్షుడు అజ్మీర వెంకన్న నాయక్, నాయకులు ప్రశాంత్, వినోద్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

మడేలయ్య ఉత్సవాలకు ఆలయం ముస్తాబు


ఉత్సవాలకు ముస్తాబైన మడేలయ్య ఆలయం

కాజీపేట: కాజీపేట మండలం సోమిడి గ్రామ శివారులో శుక్రవారం నుంచి ఆదివారం వరకు జరగనున్న మడేలయ్య ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. ఈమేరకు వివిధ ప్రాంతాల నుంచి పండితులు, బంధు, మిత్రులు రానున్న నేపథ్యంలో రంగురంగుల విద్యుత్ దీపాలతో ఆలయాన్ని అందంగా ముస్తాబు చేశారు. చలువ పందిళ్లు వేశారు. రజక సంఘం పెద్దల ఆధ్వర్యంలో సీతాలమ్మ సమేత మడేలయ్య, ఈశ్వరమ్మ తల్లి విగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవం నిర్వహించనున్నారు.

సీనియర్ అసిస్టెంట్ శ్రీవాణి సస్పెన్షన్

విద్యారణ్యపురి: హనుమకొండలోని జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో ఎస్టాబ్లిష్‌మెంట్ సెక్షన్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న శ్రీవాణిపై పాఠశాల విద్యాశాఖ ఆర్‌జేడీ సత్యనారాయణరెడ్డి సస్పెన్షన్ వేటు వేశారు. ఈ మేరకు డీఈఓ ఎండీ అబ్దుల్‌హై రిపోర్టు ఆధారంగా గురువారం శ్రీవాణిని సస్పెన్షన్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. హనుమకొండలోని ఓ ప్రైవేట్ పాఠశాల యాజమాన్యం తమ పాఠశాల రికగ్నేషన్ రెన్యువల్ చేసినందుకు గాను ఆ యజమానిని డబ్బులు అడిగారనే ఆరోపణలున్నాయి. ఆమె ఇచ్చిన నంబర్‌కు రూ.2వేలు (ఫోన్‌పే) పంపారని తెలుస్తోంది. ఆ తరువాత ఇంకా రూ.500 కోసం శ్రీవాణి సంబంధిత యజమానికి ఫోన్ చేసి అడిగారని, మా సారుకు కూడా ఇవ్వాల్సింటుందని కూడా ఫోన్ సంభాషణలో పేర్కొన్నారన్నారని, దానిని అతను వాయిస్ రికార్డుతోపాటు, డబ్బులు పంపినట్లుగా ఉన్న స్క్రీన్‌షాట్ మెస్సేజ్‌ను సంబంధిత ప్రైవేట్ పాఠశాల యజమాని ఇటీవల డీఈఓ ఎండీ అబ్దుల్‌హైకి ఫిర్యాదు చేశారు. ఈ విషయమై కలెక్టర్ సిక్తా పట్నాయక్‌కు ఫిర్యాదు చేశారని తెలుస్తోంది. ఈ వ్యవహారాన్ని కలెక్టర్ సీరియస్‌గా పరిగణించారు. దీనిపై డీఈఓను పిలిపించి మాట్లాడారు. సీనియర్ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకునే అధికారం పాఠశాల విద్యాశాఖ ఆర్‌జేడీకి మాత్రమే ఉందని కలెక్టర్‌కు డీఈఓ చెప్పారు. కలెక్టర్ ఆదేశాలతో పాఠశాల విద్యాశాఖ ఆర్‌జేడీ సత్యనారాయణరెడ్డికి డీఈఓ రిపోర్ట్ పంపగా ఆయన పరిశీలించి సస్పెన్షన్ వేటు వేశారు. శ్రీవాణిపై వచ్చిన ఆరోపణలపై గెజిటెడ్ ఆఫీసర్‌తో విచారణ జరిపిస్తామని సత్యనారాయణరెడ్డి తెలిపారు.

బ్యాడ్మింటన్ పోటీలకు పూజితరెడ్డి


పూజితరెడ్డితో కోచ్ శ్రీధర్, తదితరులు

వరంగల్ అర్బన్: గుజరాత్ రాష్ట్రంలోని వడోదరలో ఈనెల 17నుంచి 21వ తేదీ వరకు జరగనున్న 67వ జాతీయస్థాయి బ్యాడ్మింటన్ స్కూల్ గేమ్స్ అండర్ –17 బాలికల విభాగంలో మడుగుల పూజితరెడ్డి ఎంపికయ్యారు. జీడబ్ల్యూఎంసీ ఇండోర్ స్టేడియంలో శిక్షణ పొంది జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన పూజిత రెడ్డిని కోచ్ శ్రీధర్, డీఎస్ఓ శంకర్ లింగం, రవి, క్రీడాకారులు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.